## క్లుప్తంగా

### అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేత

మాట నిలబెట్టుకున్న చిర్ల జగ్గిరెడ్డి



ముమ్మిడివరప్పాడులో ఇళ్ల స్థలాల పట్టాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**రావులపాలెం:** పట్టాలు పొందిన ఆడపడుచులు అందరినీ వారి సొంత ఇంటి స్థలాల్లో నిలబెడతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ గురువారం ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. మండలంలోని ముమ్మిడివరప్పాడు, ఈతకోట గ్రామాల లేఅవుట్లలో ముమ్మిడివరప్పాడు, ఈతకోట, పొడగట్లపల్లి గ్రామాలకు చెందిన 482 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించారు. వీరికి పసుపు, కుంకుమలతో కలిపి సంప్రదాయబద్ధంగా వారి స్థలాలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అప్పగించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, సర్పంచ్‌లు సబ్బితి మోహనరావు, దొమ్మేటి అర్జునరావు, జానకీయమ్మ సత్రం చైర్మన్ కొపెల్ల మల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, వైవీ పాల్గొన్నారు.

### పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**మామిడికుదురు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాకనపాలెం గ్రామంలో 47 మంది లబ్ధిదారులకు జగనన్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలను గురువారం స్వాధీనం చేశారు. జగనన్న భూ రక్ష సర్వే పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన లావాదేవీలను వివాదరహితంగా నమోదు చేసేందుకు జగనన్న భూ రక్ష ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ మద్దాల బాబురావు, ఎంపీటీసీ వలవల పెదబాబు, తహసీల్దార్ రియాజ్ హుసేన్, పార్టీ నాయకులు యాండ్ర వీరబాబు, భూపతి ధామోదరరావు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఘనంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి జన్మదిన వేడుకలు



పి.గన్నవరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తికి బర్త్‌డే కేకను తినిపిస్తున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

**పి.గన్నవరం:** జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జన్మదిన వేడుకలను పి.గన్నవరంలోని ఆయన నివాసం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విప్పర్తి తన బర్త్‌డే కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు విప్పర్తిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, జెడ్పీ కార్యాలయ సిబ్బంది, ఎంపీపీలు దొమ్మేటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీలు బూడిద వరలక్ష్మి, గెడ్డం సంపదరావు, మట్టా శైలజ, జెడ్పీ ఉద్యోగుల సంఘ నాయకుడు రెడ్డిపల్లి రమేష్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విప్పర్తిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### మండలాభివృద్ధికి సమష్టి కృషి చేద్దాం

ఎంపీపీ అన్నపూర్ణ



**ఆత్రేయపురం:** పార్టీలకతీతంగా మండలాభివృద్ధికి సభ్యులందరూ సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ కుండా అన్నపూర్ణ అన్నారు. ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్, పశు సంవర్ధక, ఇరిగేషన్, గృహ నిర్మాణ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు తమ ప్రగతితో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. మండలంలో 2024–26 సంవత్సరానికి రూ.13.44 లక్షల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.13,44,820 నికరాదాయం వస్తుందని భావించగా, రూ.13,10,290 వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీంతో ఎంపీటీసీలు బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. జెడ్పీటీసీ బోణం సాయిబాబా, వైస్ ఎంపీపీ పి.బంగార్రాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# గడ్డి యంత్రం.. లాభాల మంత్రం

- పాడి రైతుకు ప్రయోజనాలెన్నో..
- గడ్డి సేకరణతో తీరనున్న పశుగ్రాసం కొరత
- తగులబెట్టవద్దంటున్న వ్యవసాయాధికారులు
- సద్వినియోగం అవుతున్న స్ట్రాబేలర్



పెదపళ్లలో గడ్డిని సేకరిస్తున్న స్ట్రాబేలర్

**ఆలమూరు:** వరిసాగులో అధునాతన వరికోత యంత్రాలు అందుబాటులో రావడంతో పశుగ్రాసానికి ఉపయోగించే ఎండుగడ్డి నిరుపయోగంగా మారుతోంది. దీంతో పాడి రైతులకు ఎండుగడ్డి కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో అందుబాటులో ఉన్న గడ్డి సేకరణ యంత్రం (స్ట్రాబేలర్) పశుగ్రాస సేకరణకు ఎంతగానో దోహదపడుతుంది.

ట్రాక్టర్‌కు దమ్ము చక్రాలు అమర్చే విధంగానే స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డి సేకరణ జరుపుతుండటం వల్ల ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటుంది. గతంలో స్థానికంగా ఉండే పాడి రైతులు ఒకవేళ గడ్డిని సేకరిద్దామనుకున్నా, వ్యయప్రయాసల వల్ల యంత్రంతో కోసిన వరిగడ్డిని పొలంలోనే వదిలేసి నిప్పు పెట్టేవారు. దీంతో ఎండుగడ్డి కొరత ఎక్కువై, ఏటా ధర పెరిగిపోతోంది. మరి కొంత మంది రైతులు పెట్టుబడి ఎక్కువైనా కూలీలతో కోయించి వరిగడ్డిని భద్రపరచుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో గో సంరక్షణ కేంద్రాలకు, డెయిరీఫారాలకు, పేపర్ మిల్లులకు ఎండుగడ్డి సేకరణ కష్టసాధ్యమైంది. వారంతా స్ట్రాబేలర్ యంత్రాలను తెచ్చి, ట్రాక్టర్ సాయంతో పొలాల్లో వ్యర్థంగా పడి ఉన్న ఎండు గడ్డిని సేకరించి తీసుకువెళుతున్నారు. ఈ స్ట్రాబేలర్ పనితీరును గుర్తించిన స్థానిక రైతులు రాయితీపై తమకు ఇవ్వాలంటూ వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.



వరిచేనులో యంత్రంతో మోపుగా కట్టిన గడ్డి



గడ్డిమోపులను తరలిస్తున్న వాహనం

**ఎకరాకు రెండు టన్నుల గడ్డి**

స్ట్రాబేలర్‌తో సేకరించే పొలంలో ఎకరాకు దాదాపు రెండు టన్నుల గడ్డి లభిస్తోంది. స్ట్రాబేలర్ సుమారు 20 కేజీల చొప్పున మూట కట్టిన గడ్డిమోపులను పొలంలోనే పడవేస్తుంది. ఎకరాకు సుమారు 90 నుంచి 105 వరకూ గడ్డి మోపులు లభిస్తున్నాయి. యంత్రాలను తీసుకువచ్చిన నిర్వాహకులే ఈ గడ్డి మోపులను తమ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా ఒక్కొక్క గడ్డిమోపు రూ.30 చొప్పున ధర రైతుకు చెల్లిస్తున్నారు. వరికోత యంత్రాల మాదిరిగానే స్ట్రాబేలర్ అందుబాటులోకి రావాలని పాడి రైతులు కోరుతున్నారు.

**కాలుష్యాన్ని నివారించవచ్చు**



వరిచేలల్లో పండించిన పంటను తీసుకుని, అందులో వదిలేసిన గడ్డిని తగులబెట్టకుండా ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించడంతో పాటు పశుగ్రాసం కొరత రాకుండా చేసే అవకాశం ఉంది. గడ్డిని తగులబెట్టడం వల్ల కలిగే అగ్ని ప్రమాదాలను అరికట్టి, పొగ మహమ్మారి నుంచి ప్రజలను రక్షించవచ్చు. ట్రాక్టర్ ఉపకరణ పరికరాల్లాగే ఈ స్ట్రాబేలర్ కూడా మార్కెట్‌లో లభ్యమవుతుంది.

– కె.నాగేశ్వరరరావు,, ఏడీ, వ్యవసాయ శాఖ, ఆలమూరు

**ఎండు గడ్డి కొరత తీరనుంది**



ట్రాక్టర్‌కు వెనుక భాగాన స్ట్రాబేలర్ అనుసంధానం చేసి గడ్డిని సేకరించడం వల్ల పశుగ్రాసం కొరత నుంచి ఉపశమనం కలుగుతుంది. ట్రాక్టర్ యజమానులకు ఈ యంత్రాన్ని రాయితీపై ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ స్ట్రాబేలర్‌ల వినియోగం పెరిగితే ఎండుగడ్డి మరింత అందుబాటులో ఉంటుంది.

– కోట బూరయ్య, పాడి రైతు, పినపళ్ల

### సీతారామచంద్రుడికి లక్ష తులసి పూజ

**అంబాజీపేట:** గ్రామంలోని పెద్దవీధిలో ఉన్న సీతారామచంద్ర స్వామివారికి యర్రాప్రగడ సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులతో లక్ష తులసి పూజ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పెదపూడి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఖండవల్లి బదిరినారాయణాచార్యులు పర్యవేక్షణలో పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, తులసి పూజ నిర్వహించారు.

**బాల రాముడి విగ్రహానికి ప్రత్యేక పూజలు**

**రావులపాలెం:** తిరుమల నుంచి అయోధ్యకు తీసుకువెళుతున్న బాల రాముడు విగ్రహం గురువారం సాయంత్రం రావులపాలెం చేరింది. స్థానిక కళా వెంకట్రావు సెంటర్‌లో స్థానికులు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం నుంచి గోపాలపురం, ఈతకోట, రావులపాడు మీదుగా యాత్ర జొన్నాడ వైపు సాగింది.

**వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు**

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలజీ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ ఆరగింపులు ఘనంగా జరిగాయి. శ్రీదేవీ భూదేవి సమేత బాలబాలజీ స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు ఉత్తమ విద్యను అందించాలి : డీఈఓ

**పి.గన్నవరం:** విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని డీఈఓ కమలకుమారి అన్నారు. పి.గన్నవరంలోని శ్రీమతి శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆమె పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట, అయినవిల్లి మండలాల మ్యాథ్స్ టీచర్స్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఏఎంఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు

ఊబలంకలో 20 మంది క్రియాశీల సభ్యుల రాజీనామా



టీడీపీ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు

**రావులపాలెం:** కొన్నేళ్లుగా అహర్నిశలు కష్టపడిన ఊబలంక శెట్టిబలిజ సోదరులకు విలువ ఇవ్వని తెలుగు దేశం పార్టీ తమకు వద్దంటూ 20 మంది క్రియాశీల సభ్యులు రాజీనామాలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రజలకు చేస్తున్న మంచి పనులు, కార్యకర్తలకు ఇస్తున్న విలువను చూసి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నట్లు గురువారం వారు తెలిపారు. ఊబలంకలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన గుత్తుల ప్రసాద్, గుత్తుల గంగయ్య, గుత్తుల సూర్యనారాయణ, గుత్తుల త్రిమూర్తులు, గుత్తుల సూరయ్య, గుత్తుల రాజు, సూరంపూడి కృష్ణమూర్తి, సూరంపూడి రాంబాబు, కేతా సత్యనారాయణ, కేతా సూరయ్య, కేతా పెద్ద నరసింహారావు, గుత్తుల మాధురి, గుత్తుల వెంకటరమణ, గుత్తుల మంగ, గుత్తుల చిన్న, గుత్తుల చిన్న మాధురి తదితరులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ మల్లిడి రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

### మానవాళి జీవితాల్లో క్రిస్మస్ వెలుగు

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విక్టర్ ప్రసాద్

**రాజోలు:** క్రిస్మస్ మానవాళి జీవితాల్లో వెలుగు నింపిన పండగ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన వేగివారిపాలెంలో జీసస్ క్రైస్ట్ ప్రేయర్ హౌస్‌లో బ్రదర్ డి.సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక చర్చి పెద్దలు, యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్‌ను విక్టర్ ప్రసాద్ కట్ చేశారు. స్థానిక జై భీమ్ సేవా స్రవంతి లోగోను ఆవిష్కరిస్తారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ బయ్యా సునీత పాల్గొన్నారు. తాటిపాకలో సోమిశెట్టి ల్యాండ్ మార్క్ వద్ద విక్టర్ ప్రసాద్‌కు జెడ్పీటీసీ మట్టా శైలజ, కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్, తాడి సహదేవ్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

# హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా

- సచివాలయాల స్థాయిలో కొనసాగుతున్న క్రీడలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు, యువత



కొత్తపేటలో ఖోఖోలో పోటీ పడుతున్న బాలికలు



అంబాజీపేటలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

**కొత్తపేట:** నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు గురువారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు కోలాహలంగా సాగాయి. విద్యార్థులతో పాటు యువత ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి సచివాలయ స్థాయిలో ఈ పోటీలు జరగడంతో ఎక్కడికక్కడ పండగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రభుత్వం నగదు బహుమతులు ప్రకటించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి, రాష్ట్ర స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఆయా క్రీడా విభాగాల్లో విజయం కోసం క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు.

**క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే..**

**అంబాజీపేట:** గ్రామీణ క్రీడాకారుల్లో నెలకొన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రూపొందించారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వీరవల్లిపాలెంలో 'ఆడుదాం ఆంధ్రా'**

**అయినవిల్లి:** ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణుల్లో క్రీడలపై ఆసక్తి పెరిగిందని ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య అన్నారు. గురువారం వీరవల్లిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయి. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య క్రికెట్, వాలీబాల్, ఖోఖో ఆటలను పరిశీలించి, విజేతలను అభినందించారు. వెలువలపల్లి, చింతనలంక గ్రామస్తులు పోటీల్లో పాల్గొన్నారు.

### కళాకారుల సంఘ సమావేశం

**మామిడికుదురు:** కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ సమావేశం మామిడికుదురులో గురువారం జరిగింది. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ అందించాలని కోరింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు స్వగృహం వద్ద సంఘ వ్యవస్థాపకుడు మంగం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు, ఉండ్రు శ్రీరామారావుతో పాటు పలువురు కళాకారులను సత్కరించారు.

### భవానీల బృందం పాదయాత్ర

**మామిడికుదురు:** ఉప్పలగుప్తం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి 15 మంది భవానీల బృందం పాదయాత్రగా వెళ్తోంది. ఈ బృందం గురువారం మామిడికుదురు చేరింది. ఈ సందర్భంగా కోలా దొరబాబు, కుమారి మాత దంపతులు మాట్లాడుతూ 27న బుధవారం ఉప్పలగుప్తం నుంచి పాదయాత్రగా విజయవాడ బయలు దేరామన్నారు. 270 కి.మీ. మేర పాదయాత్ర నిర్వహించి, ఈ నెల 31న విజయవాడ చేరుకుంటామని చెప్పారు.

### అమ్మవారికి వెండి కుంకుమ భరిణి



తాటమ్మవారికి వెండి చేతి తొడుగు, కుంకుమ భరిణి సమర్పిస్తున్న అయ్యప్ప నాయుడు తదితరులు

**పి.గన్నవరం:** గ్రామ దేవత తాటమ్మకు విశ్రాంత ఉపాధ్యాయుడు గుద్దటి అయ్యప్ప నాయుడు, ఆయన కుమారులు సత్య శ్రీనివాస్, సుభాష్, తనోజ్‌కుమార్ గురువారం రూ.లక్ష విలువైన వెండి చేతి తొడుగుతో కూడిన కుంకుమ భరిణి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

### సమస్యలు ఆలకిస్తూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

గడప గడపకూ.. వెళ్లిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ఊబలంకలో పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**రావులపాలెం:** ప్రతి ఇంటికెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ.. ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తూ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముందుకు సాగారు. గురువారం ఊబలంక గ్రామంలో సచివాలయం–1 పరిధిలోని పీహెచ్‌సీ ఏరియా, మత్స్యకారుల ఏరియా, పిల్ల కాలువ గట్టు, ఎస్సీ ఏరియా తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. 210వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలుంటే చెప్పాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెప్పినవే కాకుండా, చెప్పనివి కూడా చేశామన్నారు. ఏ ప్రభుత్వం చెయ్యని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి, ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని జగ్గిరెడ్డి అన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి, మాజీ ఎంపీటీసీలు కర్రి వీర్రెడ్డి, మల్లిడి రామిరెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, కొక్కిరగెడ్డ అబ్బులు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ బూసి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గుర్తుకొస్తున్నాయ్..

మూడు దశాబ్దాలకు కలిసిన పూర్వ విద్యార్థులు



ఆలమూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**ఆలమూరు:** మూడు దశాబ్దాల క్రితం చదివిన విద్యార్థులందరూ ఓ వేదికపై చేరుకున్నారు. వారంతా జ్ఞాపకాల దొంతరలను నెమరువేసుకుని, నాటి చిలిపి అల్లరిని, గురువుల చివాట్లను గుర్తుకు తెచ్చుకుని ఆనందోత్సాహాలను పంచుకున్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–94లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకున్న అపూర్వ సంఘటన స్థానిక ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో గురువారం చోటుచేసుకుంది. పూర్వ విద్యార్థులను ఒకచోట చేర్చాలన్న ఆలోచనతో మిత్రులు నాతి లక్ష్మణరావు, చల్లా బాబీ, బొమ్మా ప్రసాద్, వట్టికూటి వెంకటేశ్వరరావు, రాంప్రసాద్, జి.ప్రశాంతి, స్వర్ణమంజరి, తమ్మిన మాధవి తదితరులు తీవ్రంగా శ్రమించారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఎట్టకేలకు ఒకచోట చేర్చారు. ఆలమూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నారు. నాటి గురువులను ఘనంగా సత్కరించారు. రెండేళ్లకోసారి అందరూ సమావేశం కావాలని తీర్మానించుకున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఆలమూరు:** చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా నర్శిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు.

**సఖినేటిపల్లి:** వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ట్రీ కట్టింగ్ కోసం సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, గుడిమూల, గొంది గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు చెప్పారు.

**మామిడికుదురు:** నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మొగలికుదురు, నగరం గ్రామాలు, రాజోలు మండలం తాటిపాకలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు 33 కేవీలైన్‌లో మరమ్మతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

**పి.గన్నవరం:** విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. ముంగండ ఫీడర్ పరిధిలోని పోతవరం, ముంగండ, ముంగండపాలెం, కె.ముంజవరం, కఠారులంక, కారుపల్లిపాడు, ఉలిశెట్టివారిపాలెం, గాజులగుంట, ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ఏనుగుపల్లిల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని వివరించారు. అలాగే జి.పెదపూడి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదిమూలంవారిపాలెం, వైవీ పాలెం, ఊడిమూడి, ఊడిమూడిలంక, జి.పెదపూడి, జి.పెదపూడిలంక, పెదమల్లంక, అనగార్లంక గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు భేష్

**రాజోలు:** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వ ప్రభాకరీ అధికారి డాక్టర్ శోభిత్ గుప్తా సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం పొదలాడ గ్రామంలో వికసిత భారత సంకల్ప యాత్ర నిర్వహించిన తీరును పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. రైతులకు డ్రోన్ ద్వారా కలిగే లాభాలను వ్యవసాయాధికారులు శోభిత్‌గుప్తాకు వివరించారు. పొదలాడలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. డీపీఓ కృష్ణకుమారి, డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావు, డీఎల్‌పీఓ బుచ్చిరాజు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, ఏఓ మధుకుమార్, సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా కల్యాణ్‌బాబు

**మామిడికుదురు:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడిగా కారుపల్లి కల్యాణ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో ఎస్టీయూ మండల శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొమ్ముల వీరరాఘవరావు, ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్ రజీ, అబయ్ కన్వీనర్‌గా వలవల శ్రీబాలాజీ, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా వడ్లమూడి రాజు, సీపీఎస్ కన్వీనర్ నేల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

### రోడ్డు ప్రమాదంలో పూల వ్యాపారి మృతి

**కొత్తవలస:** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గేటు సమీపంలో గురువారం అరకు–విశాఖ రోడ్డులో విశాఖ నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్నలారీ ఢీకొనడంతో తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలానికి చెందిన పూలమొక్కల వ్యాపారి రామారావు(58) మృతి చెందాడు. మృతుడు సైకిల్‌పై పూలమొక్కలను తీసుకెళ్లి స్థానికంగా అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మొక్కల అమ్మకాలు పూర్తిచేసుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. లారీ డ్రైవర్ కొత్తవలస పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. Website: www.shriramfinance.in

జోనల్ ఆఫీస్: డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురు, పవర్‌పేట, ఏలూరు - 534002

**డిమాండ్ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సీఎల్‌టి బెంచ్–11 చెన్నై, తేది : 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తరువాత (30-11-2022 తేదీ నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిస్టర్డ్ ఆఫీసును మరియు జోనల్ ఆఫీస్ డి.నెం. 22బి-13-8, 2వ అంతస్తు, వెంకటరామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురు, పవర్‌పేట, ఏలూరు – 534002 నందు బ్రాంచి ఆఫీస్ [illegible] నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను [illegible] రిజిస్టర్డై ఉన్నాము.

[illegible]

| క్ర సం. | ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు | NPA తేది / ఋణ మొత్తం | డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం |
|---|---|---|---|
| 1 | 1) త్రినాథ్ రెడ్డి మల్లిడి, తండ్రి: [illegible] వెంకట సత్యనారాయణ రెడ్డి, డి.నెం. 6–368, రావులపాలెం టౌన్ & మండలం, తూర్పు గోదావరి జిల్లా - 534238. 2) మల్లిడి సీతామహాలక్ష్మీదేవి, భర్త: త్రినాథ్‌రెడ్డి, డి.నెం. 6-368, రావులపాలెం టౌన్ & మండలం. తూర్పు గోదావరి జిల్లా - 534238. 3) వటాల శేషాయమ్మ, భర్త: శ్రీనివాసరెడ్డి, డి.నెం. 6-120, [illegible] గ్రామం & మండలం, [illegible] జిల్లా – [illegible] 4) వటాల సత్యవతి, భర్త: [illegible] రెడ్డి, డి.నెం. 7-6, [illegible] గ్రామం & మండలం, [illegible] జిల్లా – 533261. 5) పిల్లి శ్రీను, తండ్రి: [illegible], డి.నెం. 7-66-3, [illegible] పేట, ఆత్రేయపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533236 | 08-06-2023 / Rs. 50,00,000/- | 13-12-2023 / ది. 13-12-2023 నాటికి రూ. 78,94,762/- (అక్షరాలా డెబ్బై ఎనిమిది లక్షల తొంభై నాలుగు వేల ఏడు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే) లోన్ అగ్రిమెంట్ నెం. TANUKTF2203300005 |
| | ఆస్తి వివరములు : శ్రీ త్రినాథ్‌రెడ్డి మల్లిడి. వటాల శేషాయమ్మ మరియు వటాల సత్యవతి గార్ల పేరిట తూర్పు గోదావరి జిల్లా, రావులపాలెం మండలం, పూర్వపు కొత్తపేట సబ్ డిస్ట్రిక్ట్, ప్రస్తుతం రావులపాలెం సబ్ డిస్ట్రిక్ట్, [illegible] లంక గ్రామం, [illegible] పాత ఎస్.నెం. 10/4ఎ, కొత్త ఎస్.నెం. 10/10 వద్ద ఎకరా 0.90 సెంట్లు మరియు ఎస్.నెం. 10/5ఎ, కొత్త ఎస్.నెం. 10/11 వద్ద ఎకరా 0.19 సెంట్లు మొత్తం ఎకరా 1.09 సెంట్లు లేదా 5275.6 చ.గజాలు లేదా 4411.07 చ.మీటర్ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. హద్దులు : తూర్పు : రావులపాలెం నుండి [illegible] లంక వెళ్ళు రోడ్డు, దక్షిణం : [illegible] సత్యనారాయణరెడ్డి గారి స్థలము, పడమర : వటాల [illegible] రెడ్డి గారి స్థలము, ఉత్తరం : మల్లిడి త్రినాథ్ రెడ్డి గారి స్థలము. | | |

[illegible]

తేది : 13-12-2023, ప్రదేశం : ఏలూరు

సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.